# అలిపిరి మార్గం భద్రతకు శాశ్వత చర్యలు



- క్రియాశీలక ఉత్తర్వులు
- 24 లోపు నిర్ణయాన్ని వెల్లడించనున్న టీటీడీ

**టి మీడియా, సెప్టెంబర్ 9, విజయవాడ :** అలిపిరి నడక మార్గంలోని భక్తుల భద్రతకు తీసుకొనే శాశ్వత చర్యలపై టీటీడీ త్వరలో స్పష్టత ఇవ్వాల్సి ఉంది. భక్తులపై చిరుతల దాడులు, చేపట్టాల్సిన భద్రత చర్యలపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి గతంలో దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు ఇటీవల క్రియాశీలక ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో నవంబరు 24 తేదీలోపు టీటీడీ తన నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేయాల్సి ఉంటుంది.

**రెండువైపులా ఇనుప కంచె**

పిల్‌లోని ప్రధాన అంశం కంచె ఏర్పాటు. ప్రస్తుతం భక్తులు నడుస్తున్న దారికి రెండువైపులా ఇనుప కంచె ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని హైకోర్టు సూచించింది. క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు గుర్తించి పదడుగుల ఎత్తువరకు ఇనుపకంచె ఏర్పాటు చేయాలన్నది పిటిషనర్ ప్రధాన ఉద్దేశం.గాలిగోపురం నుంచి ఏడో మైలు మీదుగా నరసింహస్వామి ఆలయం వరకు సుమారు మూడు కి.మీ. పరిధిలో చిరుతల సంచారం అధికంగా ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. ఈ ప్రదేశం పూర్తిగా శ్రీవేంకటేశ్వర అభయారణ్యం పరిధిలో ఉంది. ఒకవేళ ఇనుప కంచె ఏర్పాటుచేస్తే వన్యప్రాణుల సంచారానికి అనువుగా ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది తేలాల్సి ఉంది. ఈ ప్రదేశంలో కొంతభాగం టీటీడీకు సంబంధించినది కావడంతో అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుందని అటవీశాఖ చెబుతోంది.

**అక్రమంగా దుకాణాలు**

అలిపిరి నడక మార్గంలో అక్రమంగా ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలకు కొదవ లేదు. టీటీడీ, అటవీశాఖ లైసెన్సులు ఇచ్చిన దుకాణాలు 58 ఉండగా అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలు, తట్టలు వందకుపైగా ఉన్నాయి. చిరుత దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాలిక లక్షిత ఉదంతం అనంతరం అటవీశాఖ సదరు దుకాణాలపై చర్యలకు ఉపక్రమించినా అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కు తగ్గింది.తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో అలిపిరి నడక మార్గంలో ఆహార పదార్థాలు విక్రయిస్తున్న దుకాణాలు తొలగించాలన్న కీలక ఆదేశాలున్నాయి. అటవీశాఖ ఎప్పట్నుంచో చేపట్టాలనుకున్న చర్యలకు ఉత్తర్వులు మార్గం సుగమమం చేశాయని భావిస్తున్నారు. దీనిపై టీటీడీ సైతం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

**ఏఐతో నిరంతర పర్యవేక్షణ**

ప్రస్తుతం చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగులను ఎప్పటికప్పుడు గుర్తించి భక్తులను అప్రమత్తం చేసేందుకు అటవీశాఖ ప్రత్యేక వ్యవస్థను సమకూర్చుకుంది. అలిపిరి గాలిగోపురం నుంచి నరసింహస్వామి ఆలయం వరకు 100 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోని 30 పైగా ఉన్న చిరుతల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది.సోలార్‌తో పనిచేసే ఏఐ ఆధారిత లైవ్ కెమెరాలు 30 వరకు ఉండగా వీటిని కంట్రోల్ స్టేషన్లకు అనుసంధానం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. కంచె ఏర్పాటు అనివార్యమైతే ఈ రక్షణ వ్యవస్థలన్నీ నిర్దేశిత ప్రాంతాలకే పరిమితం చేసి మరింత సమర్థంగా వినియోగించే అవకాశం ఉంటుంది.

**చిరుత రహిత ప్రాంతంగా అలిపిరి**

అలిపిరి మెట్ల మార్గం, ఘాట్‌రోడ్ల పరిధిలో ఇటీవల చిరుత పులుల కదలికలు పెరిగిన నేపథ్యంలో మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ చర్యలపై టీటీడీ ఉన్నతాధికారులు ఇటీవలే సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ, వివిధ విభాగాల అధికారులతో మాజీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. ప్రధానంగా అలిపిరి మెట్ల మార్గంలో అదనపు సిబ్బంది కేటాయింపు, ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు వంటి చర్యలతో పాటు తక్షణ, దీర్ఘకాలిక చర్యల రూపకల్పనలో వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్, అటవీశాఖల సహకారంపై చర్చించారు. అలిపిరి మార్గాన్ని చిరుత రహిత ప్రాంతంగా మార్చేందుకు కెమెరా ట్రాప్‌లు, స్మార్ట్ స్టిక్స్, బయో ఫెన్సింగ్, నెట్‌గన్స్, హైఫ్లాష్ టార్చ్‌లు, పెప్పర్ స్ప్రే తదితర రక్షణ పరికరాల వినియోగంపై సమీక్ష చేశారు. నిషేధిత ఆహార పదార్థాల అమ్మకంపై దుకాణదారులకు అవగాహన కల్పించాలని, అలిపిరి మెట్ల మార్గంలో ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు పటిష్ఠ భద్రత, నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్




**ఆ స్టేషన్లలో స్టాపింగ్‌లకు లైన్ క్లియర్**

**టి మీడియా, సెప్టెంబర్ 10,కడప :** రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా మహమ్మారికి ముందు పలు రైల్వే స్టేషన్లలో ఉన్న స్టాపింగ్‌లను ఎట్టకేలకు పునరుద్ధరించారు. మంగళవారం రైల్వే అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలియజేశారు. ఈ నిర్ణయంతో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఎర్రగుంట్ల, కొండాపురం, నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల వాసుల ప్రయాణానికి ఉపశమనం కలగనుంది.

తిరుపతి- ఔరంగాబాద్ మధ్య నడిచే వారాంతపు రైలు(నంబరు 17622)కు ఈ నెల 14 నుంచి ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించారు. ప్రతి ఆదివారం అర్ధరాత్రి 1.24కు ఎర్రగుంట్లకు చేరుకుంటుంది.కాచిగూడ-చెంగల్‌పట్టు మధ్య ప్రతిరోజూ నడిచే రైలు (నంబరు 17652)కు ఈ నెల 14 నుంచి కోడూరులో స్టాపింగ్ ఏర్పాటు కలిగించారు. ఈ రైలు అర్ధరాత్రి 2.44 గంటలకు కోడూరులో ఆగుతుందని అధికారులు తెలియజేశారు.మధురై- లోకమాన్యతిలక్(నంబరు 22102)రైలుకు ఈ నెల 11 నుంచి రాజంపేటలో స్టాపింగ్ కల్పించారు. ఈ రైలును ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 2.09 గంటలకు రాజంపేటలో నిలుపునున్నారు.లోకమాన్య తిలక్- చెన్నై మధ్య నడిచే రైలు(నంబరు 12163)ను ఈ నెల 11 నుంచి కోడూరులో ఉదయం 11.29 గంటలకు ఆపనున్నారు.

తిరుపతి - కోల్హాపూర్‌ల మధ్య నడిచే రైలు(నంబరు 17415)కు ఈ నెల 11 నుంచి ఓబులవారిపల్లె, రాజంపేటలలో ఆగేందుకు అధికారులు స్టాపింగ్ కల్పించారు. అదే విధంగా ఈ రైలు ఓబులవారిపల్లె రాత్రి 10.29 గంటలకు, అదే విధంగా రాజంపేటలో రాత్రి 10.46 గంటలకు ఆగనుంది. తిరుగు ప్రయాణంలో(నంబరు 17416) తెల్లవారుజామున రాజంపేటలో 5.39 గంటలకు, ఓబులవారిపల్లెలో 5.59 గంటలకు ఆగనుంది.ముంబై -నాగర్‌కోయిల్(నంబరు 16351) రైలును ఈ నెల 13 నుంచి రాజంపేట, కోడూరులలో నిలుపుతారు. ఈ రైలు ప్రతి మంగళ, శనివారాల్లో మధ్యాహ్నం 2.04 గంటలకు రాజంపేటకు, మరలా 2.24కు రైల్వేకోడూరుకు వస్తుంది. తిరుగు ప్రయాణంలో(నంబరు 16352) ప్రతి ఆది, గురువారాల్లో రైల్వేకోడూరుకు రాత్రి 10.59 గంటలకు, రాజంపేటకు రాత్రి 11.24 గంటలకు రానుంది.

పుణె- కన్యాకుమారి మధ్య ప్రతిరోజూ నడిచే రైలు(నంబరు 16381)కు ఈ నెల 11వ తేదీ నుంచి కొండాపురం, నందలూరులో ఆగేందుకు స్టాపింగ్ కల్పించారు. ఈ రైలు కొండాపురంలో ఉదయం 11.22 గంటలకు, అలాగే నందలూరులో మధ్యాహ్నం 12.49 గంటలకు వస్తుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో(నంబరు 16382) ప్రతిరోజూ ఉదయం 5.51 గంటలకు నందలూరులో, 7.29 గంటలకు కొండాపురంలో రైలును నిలుపుతారు.ముంబై- చెన్నైల మధ్య నడిచే రైలు(నంబరు 22157)ను ఈ నెల 11 నుంచి ప్రతి రోజూ రాజంపేటలో సాయంత్రం 5.19 గంటలకు ఆపనున్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలును(నంబరు 22158) ప్రతిరోజూ ఉదయం 10.19 గంటలకు రాజంపేటలో నిలుపునున్నారు. స్టాపింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ముంబై- చెన్నై ఎక్స్‌ప్రెస్ (నంబరు 22159)కు ఈ నెల 11 నుంచి ప్రతిరోజూ ఉదయం 6.24 గంటలకు కోడూరులో స్టాపింగ్ కల్పించారు.

చెన్నై-అహ్మదాబాద్ మధ్య నడిచే రైలు(నంబరు20953)ను ఈ నెల 15 నుంచి రాజంపేటలో ప్రతి సోమవారం అర్ధరాత్రి 2.09 గంటలకు ఆపనున్నారు. రైలు(నంబరు 20954)ను ఈ నెల 14 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 10.14 గంటలకు రాజంపేటలో, 10.39 గంటలకు కోడూరులో ఆపనున్నారు.

## వన మహోత్సవ కార్యక్రమం



**టీ మీడియా, సెప్టెంబర్ 10, మేడ్చల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా, దుండిగల్ తాండ 2 గవర్నమెంట్ స్కూల్ నందు, మున్సిపల్ కమిషనర్ ఎం వెంకటేశ్వర్ నాయక్ స్కూలు పిల్లలతో మొక్కలు నాటించి వన మహోత్సవ కార్యక్రమాన్ని చేయించినారు, ఈ కార్యక్రమంలో ఎస్ టి కార్పొరేషన్ నుండి నర్సింగ్ రావు , ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి సాత్విక్, వార్డ్ ఆఫీసర్ సుభాష్, స్కూల్ హెచ్ఎం, మహిళ ఆర్పీలు శాంత, మంజుల, జవాన్ ఎల్లయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## డివైసిఎంను సత్కరించిన

- సీనియర్ వార్డ్ అసిస్టెంట్ మిత్ర బృందం



**టీ మీడియా, సెప్టెంబర్ 10, రామకృష్ణాపూర్:**క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ డివైసీఎం గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మధుకుమార్ ను తన చాంబర్ లో మర్యాదపూర్వకంగా బుధవారం సీనియర్ వార్డ్ అసిస్టెంట్ తన మిత్ర బృందంతో కలిసి డాక్టర్ మధు కుమార్ కు గౌతమ్ బుద్ధ విగ్రహాన్ని ఇచ్చి, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది.

## షటిల్ కోర్టుకు స్థలాన్ని కేటాయించిన అధికారులు



**టీ మీడియా, సెప్టెంబర్ 10 ,ఆత్మకూరు :**వనపర్తి జిల్లా ఆత్మకూర్ లో షటిల్ ఇండోర్ స్టేడియం కొరకు ఒక ఎకరా 24 గుంటల భూమిని మంత్రివర్యులు డాక్టర్ వాకిటిశ్రీహరి ఆదేశానుసారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆత్మకూర్ తాసిల్దార్ స్థలాన్ని కేటాయించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో డిఎస్ డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి వనపర్తి, ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్, కొల్లం, వెంకట నరసింహారావు షటిల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి





**టీ మీడియా, సెప్టెంబర్ 10, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ బి జోన్ లో బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. అదేవిధంగా రామాలయం చౌరస్తాలో అమరవీరుల స్తూపంవద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతిని అధికారికంగా జరుపుతున్నందుకు గవర్నమెంట్ కు రజక సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్కెపి రజక సంఘం సభ్యులందరు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మూల మలుపు వద్ద దారి మళ్లింపు

- ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్



**టి మీడియా, సెప్టెంబర్ 10, రామగుండం ప్రతినిధి :** గోదావరిఖని జిఎం.ఆఫీస్ చౌరస్తా,బి గెస్ట్ హౌస్ చౌరస్తా వద్ద ఉన్న హై టెన్షన్ వైర్లు క్లియర్ చేయడం జరుగుతుంది. కావున ప్రజలకు తెలియజేసేది ఏమనగా గురువారం ఉదయం 8:00 గం,నుండి 12:00 గంటల వరకు మున్సిపాలిటీ చౌరస్తా నుండి మంచిర్యాలకు వెళ్లే భారీ వాహనాలు మళ్లించడం జరుగుతున్నది.మంచిర్యాల నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు మిలీనియం కోటర్స్ క్రాస్ నుండి ఫైవ్‌క్లైన్ చౌరస్తా గాంధీ చౌరస్తా మున్సిపల్ చౌరస్తా ఆర్టీసీ బస్టాండ్ వరకు రాగలరు.లారీలు భారీ వాహనాలు ఫ్లైఓవర్ కింది నుంచి ఓసీపీ-4 పోయే దారి గుండా వెళ్లి మేడిపల్లి చౌరస్తా నుండి హైవే రోడ్డు ఎక్కగలరు.కరీంనగర్ నుండి మంచిర్యాలకు వెళ్లే టూ వీలర్,ఫోర్ వీలర్ వెహికల్స్,ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు నుంచి గంగానగర్ ఫ్లైఓవర్ వరకు మంచిర్యాల వెళ్లగలరు.అని ఒక ప్రకటన లో బుధవారం బి.రాజేశ్వరరావు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామగుండం ట్రాఫిక్ ప్రజలను కోరారు.



## సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలి

- జిల్లా ఎస్పీరావుల గిరిధర్

**టీ మీడియా సెప్టెంబర్ 10 వనపర్తి బ్యూరో :** బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్టేషన్లలో పనిచేస్తున్న సైబర్ పోలీసు వారియర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలును నివారించడం మరియు చేదించడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ పోలీసు వారియర్స్ కు “టీ షర్టులు” అందజేశారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ. సైబర్ వారియర్స్ గా చేస్తున్న వారి అనుభవాలు పనితీరు గురించి తెలుసుకున్నారు. “ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న క్రమంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యం” కావున సైబర్ వారియర్స్ రెగ్యులర్గా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పించాలి. అలాగే జిల్లా సైబర్ సెల్ తో సమన్వయం తో పని చేస్తూ సోషల్ మీడియాలో అనుమాదస్పద కంటెంట్ పై నిఘా ఉంచడం, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటలిజెన్స్ సేకరణ వంటి బాధ్యతలను కూడా సమర్థవంతంగా చేయాలి. సైబర్ వారియర్స్ తమ బాధ్యతను నైతికంగా, చట్టబద్ధంగా నిర్వహించాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మహేశ్వరరావు, సైబర్ క్రైమ్ ఎస్సై, రవిప్రకాష్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.


## కొలన్ హన్మంత్ ప్యానెల్ ఘన విజయం



**టీ మీడియా, సెప్టెంబర్ 10, మేడ్చల్:**జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10-సీ లోని విజయ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ కమిటీ (ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ) ఎన్నికలు మంగళవారం కాలనీలోని కల్చరల్ సెంటర్ హాల్ లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కొలన్ హన్మంత్ రెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఆయన ప్యానెల్ తరఫున పోటీ చేసిన 11 మందిలో 10 మంది విజయం సాధించారు. కొలన్ ప్యానెల్లో ఎస్సీ, ఎస్టీ క్యాటగిరీ లో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విజయం సాధించారు. మాజీ మం త్రి రెడ్యానాయక్కి ఆయన గెలుపొందారు. విమెన్ క్యాటగిరీ వి. సీతామాధురి, ఓపెన్ క్యాటగిరీ పి.గాయత్రీ లత, కే ముత్యంరెడ్డి, పి.ర వీంద్ర, వై.రంగారావు, ఎం.సురేందర్రెడ్డి, ఎన్.సూర్యప్రకాశరావు, ఏ.సందీప్రెడ్డి, కొలన్ హన్మంత్ రెడ్డి గెలుపొందారు. రంజిత్రెడ్డి ప్యానెల్ లో అనుపమరెడ్డి ఒక్కరే విజయం సాధించారు. ఇదిలా ఉండగా మొత్తం 304 ఓట్లకు గాను 227 ఓట్లు పోలయ్యాయి. రంజిత్ రెడ్డి ప్యానెల్, హన్మంత్ రెడ్డి ప్యానెల్ ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. మేనేజింగ్ కమిటీలో 11 మంది కార్యవర్గ సభ్యులకు గాను ఈ ఎన్ని కలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారంతా మరో సమావేశం ఏర్పాటు చేసుకుని చీఫ్ అడ్వైసర్ గా(నగర్ కర్నూల్ ఎంపీ) మల్లు రవి, అధ్యక్షులు గా కొలన్ హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎన్ సూర్య ప్రకాష్ రావు, జనరల్ సెక్రెటరీగా ఏ సందీప్ రెడ్డి, కోశాధికారిగా వి. సీతామాధురి, కమిటీ మెంబర్లగా కె. ముత్యం రెడ్డి, పి. రవీంద్ర, ఎం. సురేందర్ రెడ్డి, పి. గాయత్రీలత, సి. అనుపమ రెడ్డి ను ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు

## తనిఖీల కోసం వచ్చానని నమ్మించి

- బంగారమంతా ముందేసిన సిబ్బంది





**టి మీడియా, సెప్టెంబర్ 9,చింతలపూడి:** ప్రస్తుత కాలంలో మోసాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. నమ్మించి మోసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా తనిఖీల కోసం వచ్చానని నమ్మించి, ఓ కేటుగాడు రెండున్నర కోట్ల విలువైన బంగారాన్ని చోరీ చేశాడు. సినిమాను తలపించే భారీ మోసం ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడిలో వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఇది తీవ్ర కలకలం రేపింది. చింతలపూడిలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ సంస్థకు వడ్లమూడి ఉమామహేశ్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం 11 గంటలకు వచ్చాడు. తాను విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి వచ్చానని, ఆకస్మిక తనిఖీ కోసం వచ్చినట్లు బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, క్యాషియర్ ఆశను నమ్మించాడు. దీంతో సిబ్బంది స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న 380 బంగారు ఆభరణాల ప్యాకెట్లను అతని ముందు ఉంచారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి ప్యాకెట్‌ను పరిశీలిస్తున్నట్లు నటిస్తూ ఉమామహేశ్ సమయం గడిపాడు. సాయంత్రం 5 గంటల సమయంలో మేనేజర్, క్యాషియర్‌ను కొబ్బరినీళ్లు తీసుకురావాలని బయటకు పంపాడు. వారు తిరిగి వచ్చేసరికి ఉమామహేశ్ కనిపించలేదు. అనుమానంతో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఉమామహేశ్ నగలన్నింటినీ తన బ్యాగులో పెట్టుకుని వెళ్లిపోయిన దృశ్యాలు కనిపించాయి.చోరీ అయిన బంగారం విలువ సుమారు రూ. 2.50 కోట్లు ఉంటుందని సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. నిందితుడు చింతలపూడి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి, తెలంగాణ వైపు పారిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సంఘటన స్థానికంగా ప్రజలను మరియు వ్యాపార సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ తరహా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## దొరల పాలనకు చరమగీతం పాడిన ఐలమ్మ



**టీ మీడియా సెప్టెంబరు 10, పెబ్బేరు, బుధవారం:**తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత తొలి భూ పోరాటానికి నాంది పలికినా ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ పెబ్బేరు మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె వీరత్వాన్ని ఆయన మననం చేసుకున్నారూ అగ్రకులాల స్త్రీలు దొరసానులు తమను కూడా దొరా అని పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ప్రథమురాలు ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985 న అనారోగ్యంతో మరణించింది ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండమీది నరసింహ పట్టణ అధ్యక్షుడు వెంకట రాములు వెంకటరమణ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ యుగంధర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ యుగంధర్ రెడ్డి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ రణధీర్ రెడ్డి నరసింహ సత్యనారాయణ దయాకర్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి నరసింహ సూరన్న భాను ఇటిక్యాల సురేష్ పట్టణ ఉపాధ్యక్షుడు నరసింహ పేరూ రైచూర్ రాముడు బాలరాజు జయన్న బాలయ్య సత్యనారాయణ శ్రీను రామకృష్ణ ఇటిక్యాల శ్రీకాంత్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ డి.వేణు



**టీ మీడియా,సెప్టెంబర్ 10,పెద్దపల్లి:**తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీరవనిత చాకలి ఐలమ్మ నిలుస్తుందని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ...చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచి పోయారని, అటువంటి వీరవనితను స్మరించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.సంఘ సేవకురాలుగా,భూమి,భుక్తి కోసం,సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని,ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించా లని తెలిపారు.ప్రజలు గురవుతున్న ఇబ్బందులకు వ్యతిరేకంగా,సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి,వారి త్యాగాలు,గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి,వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి,రజక సంఘ నాయకులు,జిల్లా అధికారులు,బి.సి.కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

- నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బి. శ్రీనివాస్ గౌడ్



**టీ మీడియా ,సెప్టెంబర్ 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని కొత్త బస్టాండ్ దగ్గర తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్ గౌడ్ రజక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ గారికి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేయడం జరిగిందివనపర్తి పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన , తెలంగాణ తల్లి, వీరనారి చాకలి ఐలమ్మ గారు ఉద్యమమే ఊపిరిగా పేదల శ్రేయస్సు లక్ష్యంగా, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూమి భుక్తి కోసం పోరాడిన దీశాలి గారి వర్ధంతిని వనపర్తి పట్టణంలో రజక సంఘం దగ్గర సంఘ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.రజక సంఘం నాయకులు కరాటే శీను భాస్కర్ డిజె శీను నందిమల్ల యాదయ్య మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ జనార్ధన్ రజక సంగం సీనియర్ నాయకులు బండలయ్య వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, వనపర్తి గద్దర్ రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు రజక సంఘం నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

### ఓడిపోయినా...

# పోరాటం కొనసాగుతోంది

### ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలపై సుదర్శన్ రెడ్డి



**టి మీడియా, సెప్టెంబర్ 10, ఢిల్లీ బ్యూరో :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆదర్శ పోరాటం మరింత ఉత్సాహంగా కొనసాగుతోందని ప్రతిపక్ష అభ్యర్థి బీఎస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తన ఓటమిని అంగీకరిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేశారు.ఫలితం మనకు అనుకూలంగా లేకపోయినా, మనం కలసి ముందుకు తీసుకువెళ్లదలచిన గొప్ప లక్ష్యం ఏమాత్రం తగ్గలేదు. ఆదర్శ పోరాటం మరింత ఉత్సాహంతో కొనసాగుతుంది. ఈ ఫలితాన్ని నేను వినమ్రంగా అంగీకరిస్తున్నా. మా మహత్తర గణతంత్ర ప్రజాస్వామ్య ప్రక్రియలపై నాకు అపారమైన విశ్వాసం ఉంది. ఈ ప్రయాణం నాకు గౌరవప్రదమైన అనుభవం. నా జీవితాన్ని నడిపించిన విలువలైన రాజ్యాంగ నైతికత, న్యాయం, ప్రతి వ్యక్తి గౌరవం కోసం నిలబడే అవకాశం ఇచ్చింది' అని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. తనను ఉమ్మడి అభ్యర్థిగా నిలబెట్టిన ప్రతిపక్ష నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు సుదర్శన్ రెడ్డి తెలిపారు. 'మన ప్రజాస్వామ్యం కేవలం విజయంతోనే కాదు, సంభాషణ, విభిన్న అభిప్రాయాలు, ప్రజల పాల్గొనడం ద్వారా బలపడుతుంది. సమానత్వం, సోదరభావం, స్వేచ్ఛ అనే సిద్ధాంతాలను కాపాడడానికి పౌరుడిగా నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను. మన రాజ్యాంగం ఎల్లప్పుడూ మన జాతీయ జీవితానికి మార్గదర్శక కాంతి కావాలి' అన్నారు.

#### నైతికంగా బీజేపీకి పరాజయమే : కాంగ్రెస్

మరోవైపు ఈ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ స్పందించింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షం ఏకతాటిపై నిలిచి గౌరనీయమైన ప్రదర్శనను ఇచ్చిందని పేర్కొంది. వచ్చిన లెక్కల ప్రకారం బీజేపీ విజయం సాధించినప్పటికీ నిజానికి నైతికంగానూ, రాజకీయంగాను ఓటమి అని తెలిపింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన రాధాకృష్ణన్?కు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థి సుదర్శన్? రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పోరాటాన్ని ఆదర్శవంతమైనది, ధైర్యవంతమైనది అని అభివర్ణించారు. ఇది కేవలం ఎన్నిక కాదు, ఒక ఆదర్శ పోరాటం. అధికారం కేంద్రీకరణ వైపు దారితీసే ప్రభుత్వాలను రాజ్యాంగం, ప్రజాస్వామ్యం రక్షణ కోసం నిరంతరం నిరోధించాల్సిన అవసరం ఉందని ఇది మరోసారి నిరూపించింది. కొత్త ఉపరాష్ట్రపతి పార్లమెంటు సంప్రదాయాల్లో ఉన్నతమైన విలువలను నిలబెట్టాలి. ప్రతిపక్షానికి సమాన స్థానం, గౌరవం కల్పించాలి. అధికార పక్షం ఒత్తిళ్లకు లోబడకూడదు. దేశంలో రెండో అతిపెద్ద రాజ్యాంగ పదవిగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవి స్వతంత్రత, న్యాయం, ప్రజాస్వామ్య విలువలను కాపాడే శక్తిని ప్రతిబింబించేలా పునరుద్ధరించబడాలిఇక ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక ఎందుకు అవసరమైందో కూడా గుర్తుంచుకోవాలి. ధన్?ఖడ్ వర్షకాల సెషన్ ప్రారంభం చేసిన రోజునే అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఆ రాజీనామా ఇప్పటికీ వివరణ లేని, గౌరవం లేని రీతిలో జరిగింది. ఇక ముందు రాజ్యాంగ పదవులను గౌరవిస్తూ, పారదర్శకత, బాధ్యతాయుత ధోరణి మన సంస్థలను నడిపించాలి' అని ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్? స్పందిస్తూ, ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షం ఏకమై నిలిచిందని పేర్కొన్నారు. ఈసారి ప్రతిపక్ష అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి 40% ఓట్లు సాధించారని తెలిపారు. 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షం 26% ఓట్లు మాత్రమే పొందిందని గుర్తు చేశారు. ఇది గౌరవనీయమైన పురోగతి అని అన్నారు. అదే సమయంలో, బీజేపీకి వచ్చిన లెక్కల ప్రకారం విజయం నిజానికి నైతికంగానూ, రాజకీయంగానూ పరాజయమే అని విమర్శించారు. ఆదర్శ పోరాటం మాత్రం అచంచలంగా కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

### నేపాల్‌లో వారిని

# సురక్షితంగా తీసుకొస్తాం

- ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు



**టీ మీడియా, సెప్టెంబర్ 10 , అమరావతి బ్యూరో :** నేపాల్?లో చిక్కుకున్న వారిని తిరిగి స్వస్థలానికి తీసుకువస్తామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. నేపాల్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈరోజు అనంతపురంలో సూపర్? సిక్స్?-సూపర్? హిట్? కార్యక్రమానికి వెళ్లాల్సిన లోకేశ్?, ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకుని నేపాల్?లో చిక్కుకున్న వారిని తీసుకువచ్చేందుకు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సచివాలయం నుంచి నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారితో వీడియోకాల్?లో మంత్రి లోకేశ్? మాట్లాడారు.సుమారుగా 261 మంది: ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీఎస్ విజయానంద్‌తో మంత్రి లోకేశ్ సమీక్షించారు. ఇప్పటివరకు 261 మంది తెలుగువారు నేపాల్‌లో చిక్కుకున్నట్లు గుర్తించారు. నేపాల్‌లో చిక్కుకున్న బాధితులను రప్పించేలా చూడాలని సీఎస్‌ను లోకేశ్? కోరారు. కాఠ్‌మాండూ నుంచి విశాఖకు విమానం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. బాధితులను స్వస్థలాలకు చేర్చేందుకు జిల్లాల వారీగా వివరాలు అధికారులు సేకరించారు. నేపాల్ ఎంబసీ, విదేశాంగశాఖ అధికారులతో నిరంతరం చర్చలు జరిపారు.కాఠ్‌మాండూలో మంగళగిరి వాసులు: ఏపీభవన్ అధికారులతో సీఎం కార్యాలయ అధికారి కార్తికేయ మిశ్రా సంప్రదిస్తున్నారు. పవన్ ఆదేశాలతో నేపాల్ బాధితులతో శ్రీనివాసరావు, రామకృష్ణ సమన్వయం చేశారు. కాఠ్‌మాండూలో 8 మంది మంగళగిరి వాసులు చిక్కుకున్నారు. నేపాల్‌లోని పశుపతి ఫ్రంట్ హోటల్‌లో మంగళగిరి వాసులు తలదాచుకున్నారు. మంగళగిరికి చెందిన హేమసుందర్, నాగలక్ష్మితో వీడియోకాల్ మాట్లాడారు. నిన్న తమ బస్సుపై ఆందోళనకారులు దాడి చేశారని బాధితులు తెలిపారు. హోటల్‌లో మరో 40 మంది తెలుగువారు తలదాచుకున్నట్లు బాధితులు వెల్లడించారు.కాఠ్‌మాండూలోని హోటల్‌లో విశాఖకు చెందిన 81 మంది తెలుగు ప్రజలు తలదాచుకున్నారు. విశాఖకు చెందిన రోజారాణితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏపీ ప్రజలను క్షేమంగా తీసుకొచ్చే బాధ్యత మాదని భరోసా ఇచ్చారు. విదేశాంగశాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్రతి రెండు గంటలకోసారి సంప్రదిస్తామని తెలిపారు. కాఠ్‌మాండూ నుంచి విశాఖకు విమానం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కాఠ్‌మాండూ విమానాశ్రయానికి కిలోమీటరు దూరంలోని హోటల్‌లో ఉన్నట్లు వెల్లడించారు. వైద్య, మౌలిక సౌకర్యాల సంస్థ ఛైర్మన్ టచ్‌లో ఉంటారని తెలిపారు.ఏపీ భవన్ అధికారి అర్జా శ్రీకాంత్, అధికారులతో లోకేశ్ సమీక్షించారు. ఈ సమీక్షలో కార్తికేయ మిశ్రా, ముఖేష్ కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్ జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మి పాల్గొన్నారు. 261 మంది తెలుగువారు నేపాల్‌లో చిక్కుకున్నట్లు అధికారులు వివరించారు. ఏపీ వాసులు రాష్ట్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. నిరంతరం విదేశాంగశాఖ అధికారులతో ఏపీ అధికారులు సంప్రదిస్తున్నారు.

#### ఏపీ భవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు

నేపాల్ పర్యటనకు వెళ్లి ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల కారణంగా చిక్కుకుపోయిన తెలుగు ప్రజలకు తక్షణ సాయం అందించడానికి ఏపీ ప్రభుత్వం దిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక హెల్ప్?లైన్? ఏర్పాటు చేసింది. నేపాల్?లో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న తెలుగు వారు +91 98183 95787 నంబర్‌లో నోడల్ అధికారి సురేష్‌ను సంప్రదించవచ్చునని ఓ ప్రకటనలో పేర్కొంది.

సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అక్కడి తాజా పరిస్థితులపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రితో నిరంతరం సంప్రదిస్తున్నట్లు తెలియజేసింది. అక్కడ తెలుగువారు చిక్కుకుపోయినట్లు తెలిసిన వెంటనే రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ నేపాల్‌లోని భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవతో మాట్లాడారు. వెంటనే ఎంబసీ ద్వారా సాయం అందించాలని విన్నవించినట్లు పేర్కొంది. ప్రస్తుతం కాఠ్‌మండూలోని బఫాల్ ప్రాంతంలో 30 మంది తెలుగువారు ఎంబసీ ద్వారా సాయం పొందుతున్నట్లు వెల్లడించింది.నేపాల్?లో ఉన్న భారతీయుల కొరకు భారత రాయబార కార్యాలయం ఖాట్మండు , రాష్ట్ర ప్రభుత్వాల హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటుచేసింది. నేపాల్ లో ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, నేపాల్ లో ఉన్న భారతీయుల సహాయార్థం భారత రాయబార కార్యాలయం ఖాట్మండు +977 – 980 860 2881 / +977 –% 981 032 6134 ఈ నెంబర్లకు సాధారణ కాల్స్ తో పాటు వాట్సాప్ లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కి చెందిన వారు నేపాల్ లో చిక్కుకుపోయి ఏదైనా అత్యవసర సహాయం లేదా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ఢిల్లీలోని ఏపీ భవన్ 9818395787, APNRTS 24/7 హెల్ప్ లైన్ నంబర్లు 0863 2340678, వాట్సాప్ నెంబరం 8500027678 సంప్రదించవచ్చునని అధికారులు తెలిపారు. ఇమెయిల్: helpline@apnrts.com info@apnrts.com లో సంప్రదించగలరని తెలిపారు.

### డిప్యూటీ సీఎం

# ఫొటో పెట్టొద్దని ఎక్కడ ఉంది

- ఏపీ హైకోర్టు వ్యాఖ్యలు

**టి మీడియా, సెప్టెంబర్ 9, విజయవాడ :** ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. డిప్యూటీ సీఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉందని విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయ దృష్టితో ఉద్దేశపూర్వకంగానే ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారని అభిప్రాయపడింది. ఈ మేరకు పిల్‌ను డిస్మిస్ చేసింది.చట్టబద్ధమైన అనుమతులు లేకుండా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నారంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగి వై.కొండలరావు ఈ పిటిషన్‌ను దాకలు చేశారు. చిత్రపటాల ప్రదర్శన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట విధానం తీసుకొచ్చే వరకు కార్యాలయాల్లో పవన్ కల్యాణ్ ఫొటో తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, సహాయ కార్యదర్శి, సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌తో పాటు వ్యక్తిగత హోదాలో పవన్ కల్యాణ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ



జరిపింది.ప్రజాహిత ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా కోర్టును ఆశ్రయించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. సమాజానికి మేలుచేసే విధంగా, నిజమైన ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించిన వ్యాజ్యాలను మాత్రమే న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపింది. రాజకీయ లక్ష్యాలతో కోర్టులను వేదికగా మార్చే ప్రయత్నాలు మంచివి కాదని హెచ్చరించింది.

## సాండ్ బజార్ ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**టి మీడియా, సెప్టెంబర్10,ధర్మపురి ప్రతినిధి** జగిత్యాల,పట్టణంలోని వాణినగర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాండ్ బజార్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.ప్రజలకు తక్కువ ధరలో, సులభంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ప్రకారం సాండ్ బజార్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని,దీంతో దళారీ వ్యవస్థ,ఇసుక దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని,స్టాక్ పాయింట్ల వద్ద 800, రూపాయలు చెల్లిస్తే ఇసుక ఇంటి వద్దకే చేరేలా సౌకర్యం కల్పించామని ఇసుక లారీలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్,టిజిఎండిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్,అదనపు కలెక్టర్ బిఎస్ లత,ఆర్డీవో మధుసూదన్,ప్రాజెక్ట్ అధికారివినయ్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చాకలి ఐలమ్మ వర్ధంతి



**టి మీడియా,సెప్టెంబర్10, ఎండపల్లి:** రాజారాంపల్లి వివేకానంద కూడలి వద్ద చాకలి ఐలమ్మ అభిమానులు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంఘా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ స్వామి మాట్లాడుతూ.తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణికగా ఐలమ్మ అని భూమి కోసం,భుక్తి కోసం ఐలమ్మ చేసిన తిరుగుబాటు ప్రజా వ్యతిరేక పాలనపై దండయాత్రకు సమానమని గుర్తు చేశారు. బహుజనచైతన్యానికి,మహిళా ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలని కోరారు.ఈ కార్యక్రమలో మోకెనపల్లి సతీష్,మాజీ సర్పంచ్ కొమురయ్య,కృష్ణ,మహేష్, దేవేందర్,వెంకటేష్,చెన్న సతీష్,సతీస్ పాల్గొన్నారు.

### ఇంకెన్నాళ్లు... యూరియా కష్టాలు



**టీ మీడియా, సెప్టెంబర్ 10 ,ఆత్మకూర్:**వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం కేంద్రంలో రైతులు వర్షంలో యూరియా కొరకు చెప్పులు క్యూలో పెట్టి నిలబడిన అన్నదాత. యూరియా ఎప్పుడు ఇస్తారో తెలియక రైతులు సద్దులు కట్టుకొని వచ్చి ఇక్కడే తిని సాయంత్రం వరకు వేచి చూసిన యూరియా దొరకడం లేదని వాపోతున్నారు. ఈ కష్టాలు ఇంకెన్ని రోజులు దేవుడా అని ఆవేదన పడుతున్నారు

### ఓదెల ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ : కలెక్టర్



**టీ మీడియా, సెప్టెంబర్ 10, ఓదెల:** నెలన్నర రోజులలో ఓదెల ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాన్ని, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆలయానికి సెంట్రల్ లైటింగ్ తో కూడిన రోడ్లు మార్గం ఏర్పాటు చేయాలన్నారు.

### ఉపాధ్యాయలకు సన్మానం



**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,ఆత్మకూర్ :**వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల విద్యాధికారి కే బాలరాజు ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, తులసి రాజు ముఖ్య అతిథులుగా హాజరై పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో అత్యుత్తమ సేవలు అందించిన 18 మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి ప్రశంసా పత్రము మెమెంటో బహుకరించి సన్మానం చేశారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని 6 మంది ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి మద్దిలేటి,జే బాలస్వామి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జిందె అనంతరాం, బి శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ వివిధ సంఘాల బాధ్యులు మరియు మండల పరిధిలోని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### గణపతి చందా ఇవ్వలేదని

# కుల బహిష్కరణ

#### ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా

**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,జగిత్యాల:** రూరల్ మండలం కల్లెడ గ్రామంలో సభ్య సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. ఇటీవల నిర్వహించిన వినాయక నవరాత్రుల సందర్భంగా గణపతి చందా ఇవ్వలేదని గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలను కుల బహిష్కరణ చేశారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబాలతో గ్రామంలోని వారు ఎవరూ మాట్లాడకూడదని దండోరా కూడా వేయించారు.

#### పోలీసులను ఆశ్రయించిన బాధితులు



వెలివేసిన కుటుంబాలతో ఎవరైనా మాట్లాడినట్లు తెలిస్తే వారికి రూ.25 వేల జరిమానా విధిస్తామని హుకుం జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఆ కుటుంబాలతో కులానికి చెందిన ఎవరైనా మాట్లాడినట్లు సమాచారం అందించిన వారికి రూ. 5 వేల నజరానా కూడా ప్రకటించారు. దీంతో చేసేదేమి లేక బాధిత కుటుంబాలు జగిత్యాల రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.దుబాయ్‌లో ఉన్న వ్యక్తిని కూడా : జరిగిన ఘటనపై బాధితులను అడగగా తమ కులం పేరుతో ప్రతిసారి గణపతి వేడుకలు నిర్వహిస్తారని, ఈసారి చందాలను మర్యాదపూర్వకంగా అడగకుండా వాట్సాప్ గ్రూప్‌లో పరుషపదజాలం ఉపయోగించారని వాపోయారు. ఈ గ్రూపులో 52 మంది ఉన్నట్లు చెప్పారు. ఇలా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగినందుకు అంతా ఒక్కటై తమపై కక్షపూరితంగా పంచాయితీకి పిలిచారన్నారు. అంతే కాకుండా అన్యాయంగా తమపై పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ ఇచ్చారని వాపోయారు. ఇలా చేయడంతో తాము కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. దుబాయ్‌లో ఉన్న వ్యక్తిని కూడా కుల బహిష్కరణ చేశారని అన్నారు. అతను ఏ వాట్సాప్ గ్రూప్‌లో ఉన్నా తీసేస్తున్నారని చెప్పారు.

#### పోలీసుల వివరాల ప్రకారం

ఈ కుల బహిష్కరణ ఘటనపై జగిత్యాల రూరల్ సీఐ మీడియాకు వివరాలు తెలిపారు. రూరల్ మండలంలో కల్లెడ గ్రామంలో ఒకే కమ్యూనిటి మధ్య మనస్పర్థాలు వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో చూస్తే కొన్ని కుటుంబాలను గ్రామం నుంచి వెలివేసినట్లు తెలిసిందని సీఐ అన్నారు. దీంతో వెంటనే స్పందించి ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిచినట్లు వివరించారు. కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.


#### ఇరువర్గాలతో మాట్లాడి ముందుకెళ్తాం

నిజంగా వారు తప్పు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. దీనిపై స్థానిక తహసీల్దార్?కు కూడా బాధ్యత ఉంటుందన్నారు. తప్పకుండా ఆ గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. ముందుగా ఇరువర్గాలతో మాట్లాడి తదుపరి కార్యాచరణపై ముందుకెళ్తామన్నారు.

### కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే..

# నేనూ చేస్తా

- ఎమ్మెల్యే రాజాసింగ్



**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,హైదరాబాద్:** తెలంగాణ భాజపా నాయకత్వంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ తనకు ఎలాంటి సహకారాలు అందించలేదని అన్నారు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదని చెప్పారు. "నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయను. కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేనూ చేస్తా. ఆయన రాజీనామా చేస్తే ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. పార్టీని సర్వనాశనం చేస్తున్నదో ఎవరో మరోసారి చెప్తాను. నాకు ఎప్పటి నుంచో కేంద్రం పెద్దల ఆశీర్వాదం ఉంది. నేను ఎప్పటికీ భాజపా నేతనే"అని రాజాసింగ్ అన్నారు.



### మహారాష్ట్ర నుంచి

# భారీగా దిగుమతి

- కర్నూలు ఉల్లిపై అనాసక్తి

**టి మీడియా, సెప్టెంబర్ 10,,కర్నూలు :**

గతేడాది కర్నూలు జిల్లాలో పండించిన ఉల్లి క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ ధర పలికింది. ప్రస్తుతం మహారాష్ట్ర నిల్వలు పెద్ద ఎత్తున వస్తుండటంతో జిల్లాలో సాగైన ఉల్లికి డిమాండ్ తగ్గింది. క్వింటాకు రూ.1,000 కూడా పలకడం లేదు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి తక్కువ ధరకే విక్రయిస్తున్నా సరే ప్రజలు, హోటళ్ల యజమానులు, దుకాణదారులు జిల్లా ఉల్లిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.12కే విక్రయిస్తున్నా సరే మొగ్గు చూపని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.

#### పేరుకుపోయిన నిల్వలు

కర్నూలు మార్కెట్‌యార్డులో వేల టన్నుల సరకు పేరుకుపోయింది. ఉల్లిని కొనేవారు లేక మార్కెట్ వెలవెలబోతోంది. మహారాష్ట్ర ఉల్లి అయితే 6-8 నెలల పాటు నిల్వ ఉంటుందనీ, కానీ జిల్లాలో సాగైన ఉల్లి వారం, పది రోజుల మించి నిల్వ ఉండటం లేదనీ, అందుకే అక్కడి ఉల్లి తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నామని నగరానికి చెందిన ఓ వ్యాపారి పేర్కొన్నారు.గతంలోని రబీ సీజన్‌లో మహారాష్ట్రలో ఎన్నడూ లేనంత భారీస్థాయిలో ఉల్లిపంట సాగైంది. దాంతో ఈ ఏడాది ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఉమ్మడి జిల్లాకు వారానికి 20 లారీల చొప్పున వచ్చింది. అందుకు అనుగుణంగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వారానికి దాదాపు 40 లారీల చొప్పున దిగుమతి చేసుకున్నారు. ఈ విధంగా వారానికి దాదాపు 20 లారీల వరకు పొరుగు సరకు వస్తోంది. ఇలా గడిచిన ఏడు నెలల్లో ఉమ్మడి జిల్లాకు వెయ్యి లారీలకు పైగా దిగుమతి అయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కో లారీలో 25-30 టన్నులు చొప్పున 30,000 టన్నుల వరకూ వచ్చింది.

#### కట్టడి చేయడంలో అధికారులు విఫలం

మహారాష్ట్ర ఉల్లిని ఉమ్మడి జిల్లాలోకి అనుమతించకుండా కట్టడి చేస్తేనే తమకు కొంతైనా న్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన ఉల్లిని జిల్లాలోకి అనుమతించకుండా అడ్డుకట్ట వేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైంది. మహారాష్ట్ర సరకుకు అడ్డుకట్ట వేయడంతో పాటు టోకు వర్తకులు, హోటళ్ల యజమానులు, చిరువ్యాపారులు జిల్లాలో పండిన ఉల్లినే కొనేలా చర్యలు చేపడితేనే కొంతమేరకైనా గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉందని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఉల్లిని జిల్లా వ్యాపారులు రవాణా ఖర్చులతో కలిసి క్వింటా రూ.1900తో దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా క్వింటా రూ.2 వేల నుంచి రూ.2100తో కిలో రూ.20- రూ.25కు విక్రయిస్తున్నారు. కానీ జిల్లాలో పండిన ఉల్లిని మాత్రం ట్రేడర్లు క్వింటా రూ.600-800 లోపే కొనుగోలు చేస్తున్నారు. సరకు నాణ్యంగా ఉంటే చిరు వ్యాపారులు, హోటళ్లు, వ్యాపారులకు క్వింటా రూ.1000- 1500తో విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.10-15 ధర మాత్రమే పలుకుతోంది.